ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం | 26 జులై, 2026 | పేజీలు :08

## 40 ఎకరాల ఫారెస్ట్ భూముల ఆక్రమణదారులపై చర్యలు

### సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ముస్తాబాద్ మండలం నామపూర్ శివారులోని పల్లగుట్టలో 40 ఎకరాల ఫారెస్ట్ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి నీ కలిసి శనివారం సిపిఐ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి ఆధ్వర్యంలో సిరిసిల్లలో వినతి పత్రం అందజేశారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ శివారులోని గూడూరు పల్లగుట్ట లో 410 సర్వే నెంబర్లు కోట్లాది రూపాయల విలువైన అటవీ భూమిని దాదాపు 40 ఎకరాలను బడా బాబులుగా ఉంటున్న వారు ఆక్రమించారని ఆరోపించారు. ఫామ్ హౌస్ కట్టుకొని ఆ భూములకు చుట్టు కంచెలు వేసుకున్నారనీ ఆ భూములు వారి సొంతమే అయినట్టుగా జెసిబిల ద్వారా మట్టి తవ్వకాలు చేస్తూ అడవిని పర్యావరణాన్ని దెబ్బతీస్తూ వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి చుట్టు గ్రామాలకు ఎంతో అండగా ఉన్న ఆ గుట్టలను ధ్వంసం చేయటానికి పూనుకున్నారని విమర్శించారు. అధికారులు తక్షణమే చర్య తీసుకోవాలని ఆ గుట్టలను పరిరక్షించాలని పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఐ జిల్లా నాయకుడు సోమ నాగరాజు శ్రీధర్ ఉన్నారు.

# మంథని గురుకుల హాస్టల్‌లో
# విద్యార్థుల ఆత్మహత్యాయత్నం



### ప్రజా సంఘాల తీవ్ర ఆగ్రహం

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల హాస్టల్‌లో శనివారం కలకలం రేగింది.ఇద్దరు విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో డెటాల్ తాగి అస్వస్థతకు గురయ్యారు. గమనించిన సిబ్బంది వెంటనే వారిని చికిత్స నిమిత్తం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం విద్యార్థులకు సెలైన్ ఎక్కించి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. విద్యార్థులు డెటాల్ తాగడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న వెంటనే వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధిత విద్యార్థులను పరామర్శించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ,వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులకు,వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.
విద్యార్థులు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతుంటే, బాధ్యత గల హౌస్ మాస్టర్,హెల్త్ సూపర్‌వైజర్,హాస్టల్ ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంపై ప్రజా సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతో జూమ్ మీటింగ్‌లో ఉన్నామంటూ వారు సమాధానం చెప్పడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు.
గతంలోనూ మంథని గురుకుల హాస్టల్‌లో ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయని నాయకులు గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆహారం, వసతులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్,కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజకుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విధులలో నిర్లక్ష్యం వహిస్తే
# శాఖాపరమైన చర్యలు



ఎస్పిమహేష్ బి.గితే.

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** క్రమశిక్షణ,నిబద్ధతతో ప్రజల మన్నలను పొందేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పని చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ అవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఆర్మ్మడ్ రిజర్వ్ ,సివిల్,హోమ్ గార్డ్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్ కి జిల్లా ఎస్పీ హాజరై గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్ ప్రదర్శనని పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రతి రోజు కనీసం అరగంట నడక చేయడం, బయట ఆహారాన్ని వీలైనంత వరకు నివారించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ, యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్నెస్‌కి ఉపయోగపడుతుందన్నారు. ఈపరేడ్ లో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ లు మధుకర్, సురేష్, రమేష్, ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రవణ్ యాదవ్, దిలీప్, సాయి కిరణ్, ఆర్మ్మడ్ సిబ్బంది, సివిల్ సిబ్బంది, హోమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెలిచాల సమక్షంలో
# కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. శనివారం కొత్తపల్లి ప్రజా కార్యాలయంలో బావుపేట, ఆసీఫ్‌నగర్‌కు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తపల్లి మండల దూదేకుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ హసన్, ఎండి నయీమొద్దీన్, ఎండి. జావేద్, ఎండి రఫీక్, ఎండి అమీర్ రావణవేని తిరుపతితోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా రాజేందర్ రావు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి మరింత ఆదరణ తీసుకురావాలని సూచించారు. ప్రజల విశ్వాసమే కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద బలమని రానున్న రోజుల్లో మరింత మంది కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలగందుల సర్పంచ్ నిమ్మల అంజన్న, ఉప సర్పంచ్ గసికంటి కుమార్, ఏఎంసీ డైరెక్టర్ రావణవేణి సంపత్, మాజీ ఎంపిటిసి బోనాల కనకయ్య,కాంగ్రెస్ నాయకులు బోనాల అశోక్, గుర్తూరి మురళి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బిజెపి నాయకులు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి శనివారం బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు కొలకాని రాజు బిజెపి నాయకులతో కలిసి డాక్టర్‌తోపాటు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జమ్మికుంట ఆసుపత్రికి డయాలసిస్ సెంటర్ మంజూరు చేసినట్లు ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు దానికి సంబంధించిన వైద్య పరికరాలు రాలేదని పట్టమంలో 70 మంది వరకు డయాలసిస్ బాధితులు ఉన్నారని వారు డయాలసిస్ కోసం హుజురాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లి రావడం ఆర్థికంగా నష్టపోతున్నారని ఇప్పటికైనా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ప్రణవ్ బాబు చొరవ తీసుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని కనీసం నిరుపేదల సమస్యలపై స్పందించడం లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు కోటిన్నర రూపాయల విలువైన వైద్య పరికరాలు అందించి నిరుపేదలకు ఉపశమనం కలిగించారని ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు, టెక్నిషియన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించి 24 గంటలు వైద్య



సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబిసి అధ్యక్షులు ఆకుల రాజేందర్, కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, కనుమల్ల గణపతి, కైలాస కోటి గణేశ్, అడువాల శ్రీధర్, ఎదులాపురం శ్రీనివాస్, చంద సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన పొలం మల్లక్క ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం మృతిరాలి భర్త పొలం పోశాలు, కుమారుడు ప్రవీణ్‌కు 2,000 వేల రూపాయల నగదుతో పాటు 25 కేజీల బియ్యాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు ఐలాపురం లావణ్య, కుమారస్వామి, బొమ్మిడి మల్లేష్, పొలం సతీష్,కూన రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేట గురుకులాన్ని ముస్కు జైపాల్ రెడ్డి తనిఖీ



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెంకట్రావుపేట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డా. ముస్కు జైపాల్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు (హెల్త్ స్క్రీనింగ్) నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానం, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.అలాగే, చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిన సరైన పద్ధతులను (హ్యాండ్ వాష్ టెక్నిక్స్) ప్రదర్శించి, భోజనానికి ముందు మరియు మరుగుదొడ్డి వినియోగం అనంతరం తప్పనిసరిగా చేతులు కడుక్కోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని వివరించారు.ఈ తనిఖీలో భాగంగా మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డితో కలిసి పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన విద్యార్థులే దేశ భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తారని డా. ముస్కు జైపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## విద్యార్థి, యువత పోరాట విజయం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యార్థుల పోరాటానికి తలవంచిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థి, యువజనుల పోరాట విజయమని,విద్యార్థులు యువత,కార్మికుల ఐక్య పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం తలవంచిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య అన్నారు. కోతిరాంపూర్ లోని ముకుంద లాల్ మిశ్రా భవన్ లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రం లీకేజీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు,యువత ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతి





యుతంగా చేపట్టిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయాలని ఎన్ని కుట్రలు చేసినా ప్రజా ఉద్యమం ముందు తలవంచక తప్పలేదని అన్నారు. తప్పు చేసినప్పుడు ఎంతటి వారైనా ప్రజా ఉద్యమం ముందు తలవంచక తప్పదని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి,గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం,జిల్లా కమిటీ సభ్యులు నరేష్ పటేల్, నాయకులు పుల్లెల మల్లయ్య, గజ్జల శ్రీకాంత్,రాయికంటి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు గర్వకారణం ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ ఫెర్టి 9 ఫెర్టిలిటీ సెంటర్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలుస్తుందని కరీంనగర్ ఫెర్టి 9 సెంటర్ డా.బిజిపి పిళ్లై అన్నారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫెర్టి 9 ఫెర్టిలిటీ సెంటర్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పిళ్లై మాట్లాడుతూ తెలంగాణలో ప్రముఖ ఫెర్టిలిటీ కేర్ నెట్‌వర్క్‌గా పేరుగాంచిన ఫెర్టి 9కు ఈ ఏడాది అంత ర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించిందని అన్నారు. ఇందులో భాగంగా ఫెర్టి 9 క్లినికల్ బృందం ప్రపంచ ప్రఖ్యాత సదస్సుల్లో తమ పరిశోధన పత్రాలను సమర్పించి సంస్థ ప్రతిష్టను మరింత పెంచారని అన్నారు. దేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు



క్రమంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో ఇది 1.8, ఆంధ్రప్రదేశ్‌లో 1.7కు చేరిందని తెలిపారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ఆధునిక ఫెర్టీ 9 సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. పరిశోధన, నాణ్యమైన వైద్య సేవలు, రోగి కేంద్రిత సంరక్షణతో ఫెర్టిలిటీ రంగంలో విశ్వసనీయ సంస్థగా ఫెర్టి 9 కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వారంలోగా భగత్‌నగర్ దొంగలను పట్టుకోవాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంలో శాంతిభద్రతలు మరుగున పడ్డాయని, వరుస దోపిడీలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



నగరంలోని భగత్ నగర్ చౌరస్తాలో ఇటీవల దోపిడీకి గురైన మున్నాభాయ్ కుటుంబాన్ని ఆయన శనివారం పరామర్శించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్న అనంతరం పోలీసుల వైఫల్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా నిందితులను అరెస్ట్ చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నెలలోనే తమ కారు చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు ఎమ్మెల్యే గంగుల ఎదుట వాపోయారు. అప్పుడే స్పందించి కారు దొంగలను గుర్తించి ఉంటే, ఇప్పుడు ఈ భారీ దోపిడీ జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కారు ఎత్తుకెళ్లిన దుండగులే పథకం ప్రకారం ఇంటికి వచ్చి, కుటుంబ సభ్యులపై దాడి చేసి సుమారు 62 తులాల బంగారం, రూ. 25 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితులు అనుమానిస్తున్న వ్యక్తుల సీసీటీవీ ఫుటేజీ ఫోటోలను అందించినప్పటికీ పోలీసులు నిందితులను పట్టుకోవడంలో విఫలమయ్యారని గంగుల విమర్శించారు. తాను పుట్టి పెరిగిన కరీంనగర్‌లో ఏనాడూ ఇలాంటి దుర్ఘటనలు చూడలేదని గంగుల కమలాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వినాయక మండపాల ఏర్పాటును అడ్డుకోవడం, విగ్రహాలు ఎత్తుకెళ్లిన నిందితులను పట్టుకోలేకపోవడం లాంటి ఘటనలు కేవలం కరీంనగర్ పోలీసులకే చెల్లాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, నాయకులు సుంకిశాల సంపత్ రావు, నేతి రవి వర్మ, మిడిదొడ్డి నవీన్, జి.పి. స్వామి పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్‌సి మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియామకం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీ నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.బత్తుల లక్ష్మీ నారాయణ గతంలో బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చొప్పదండి మండలం గుమ్లాపూర్ ఎంపీటీసీగా సేవలందించారు.ఈ సందర్భంగా బత్తుల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో బిజెపి, ఎస్సీ మోర్చా బలోపేతానికి తనవంతు పూర్తి కృషి చేస్తానని తెలిపారు. కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, అలాగేతన నియమాకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులందరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే గంగులను కలిసిన బిఆర్ఎస్ నాయకుడు సుంకిశాల

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** బిఆర్ఎస్ నాయకులు సుంకిశాల సంపత్ రావు జన్మదినం సందర్భంగా కరీంనగర్ శాసన సభ్యులు, మాజీ మంత్రి గంగల కమలాకర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుంకిశాల సంపత్ రావుకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శాలువా కప్పి సన్మానించి స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంపత్ రావు నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో రాజకీయ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా దీవించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు కర్ర సూర్యశేఖర్, మిడిదొడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పారమితలో ఘనంగా కార్గిల్ విజయోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కొత్తపల్లి మండలం పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో కార్గిల్ విజయ దినోత్సవ సందర్భంగా దేశభక్తి ఉట్టిపడేలా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద్ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా కల్నల్ ఎ.కె.జయంత, సుబేదార్ మేజర్ జాంగ్‌బజ్ ఖాన్, సుబేదార్ విజయ్ కుమార్, హవల్దార్ ప్రతాప్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబించే నృత్యాలు, గీతాలు ఆలపించి కార్గిల్ యుద్ధ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశభక్తి క్రమశిక్షణ, సేవాభావం ప్రతి విద్యార్థిలో పెంపొందాలని ఆకాంక్షించారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద్ రావు కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ విద్యార్థులందరూ సరైన క్రమశిక్షణను అలవర్చుకోవాలని దాంతోపాటు మంచిగా చదువుకొని దేశ ప్రజలకు సేవ చేయాలని అది కూడా సైనికులు దేశానికి చేసే సేవతో సమానమని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేశ్, ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, గోపికృష్ణ, నాగరాజు, రాము, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్కంఠగా కొనసాగుతున్న సిబిఎస్‌ఇ క్లస్టర్ 7 ఖోఖో పోటీలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** విద్యార్థులు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తద్వారా వారికి ఒత్తిడి నుంచి ఉపశమనం కలగడమే కాకుండా పని పట్ల ఆసక్తి పెరుగుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో రెండో రోజు సిబిఎస్ఈ క్లస్టర్ 7 ఖోఖో పోటీల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మ్యాచ్ చాలా ఉత్కంఠగా కొనసాగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి స్ఫూర్తిదాయకంగా ఆడుతున్నారని కొనియాడారు. అనంతరం అండ14, అండర్17, అండర్19 మ్యాచ్‌లలో విజేతలైన విద్యార్థులను అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖోకో అసోసియేషన్ రిఫరీస్ బోర్డు కన్వీనర్ వి.సూర్య ప్రకాశ్, రవీందర్, అంతర్జాతీయ రిఫరీ ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు వివిధ పాఠశాల ప్రిన్సిపల్స్, టీం మేనేజర్లు, కోచ్‌లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెయిన్ రోడ్డు విస్తరణకు వ్యాపారస్తులు సహకరించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని జండా చౌరస్తా నుండి మజీద్ వరకు గల మెయిన్ రోడ్ ( వెడల్పు )అభివృద్ధికి వ్యాపార,వాణిజ్య యజమానులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య అన్నారు. శని వారం రోజున ఉదయం జండా చౌరస్తా వద్ద గల మున్సిపల్ సముదాయ భవనాన్ని, పోస్ట్ ఆఫీస్ , బిఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రహరీ గోడను తొలగిం చడం జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా జెండా చౌరస్తా నుండి మజీద్ రోడ్డు వరకు ప్రతిరోజు రద్దీ ఎక్కువ ఉన్నందున జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ & పెద్దపల్లి శాసనస భ్యులు చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు రోడ్డు అభివృద్ధి చేయడం జరుగుతుందని గ్రామపంచాయతీ పాత రోడ్డు 80 ఫీట్లు ఉన్నప్పటికీ మున్సిపల్ కౌన్సిల్ 60 ఫీట్లకు ఏకగ్రీవంగా తీర్మానం చేయగా వ్యాపారస్తులు,ఇంటి యజమానుల కోరిక మేరకు ఎమ్మెల్యే 55 ఫీట్లకు నిర్ణయించడం జరిగిం దని,దుకాణ యజమానులందరు వారు స్వచ్ఛందంగా



రెండు,మూడు రోజుల్లో తొలగించుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని, పట్టణ మెయిన్ రోడ్డు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు.ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సి లర్లు మంథని నర్సింగ్, కమల్, పాల్గొన్నారు.

## మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా యువత విజయమే

ప్రజాపక్షం/పెద్దపల్లి : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత, విద్యా ర్థులు సాధించిన విజయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. గత నెల రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గి ఈ నిర్ణయం తీసుకోవడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని అన్నారు.ఈ సంద ర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కేంద్ర మంత్రి రాజీనామా మాత్రమే కాదు.తమ హక్కుల కోసం దేశవ్యాప్తంగా యువత,విద్యార్థులు ఐక్యంగా చేసిన పోరాటానికి లభించిన ఫలితం అని,యువత సంకల్పం ముందు ఎంతటి ప్రభుత్వమైనా తలవంచాల్సిందే నని మరోసారి నిరూపితమైందని పేర్కొ న్నారు.విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం, వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడడం ఏ ప్రభుత్వా నికీ తగదని ఆయన అన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.భవిష్యత్తులో కూడా విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే నిర్ణయాలు తీసు కుంటే కాంగ్రెస్ పార్టీ యువతతో కలిసి పోరాటం చేస్తుందని హెచ్చరించారు.దేశవ్యాప్తంగా ఉద్య మించిన విద్యార్థులు,యువతకు అభినందనలు తెలియజేశారు.

## సకల క్రీడలకు మూలం యోగా: ఎమ్మెల్యే

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : ప్రస్తుతం ఉన్న ప్రతి క్రీడకు యోగానే మూలాధారమని దాని నుంచి అన్ని క్రీడలు ఉద్భవించాయని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం విన్యాస యోగ సెంటర్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆహ్వానిత యోగా పోటీలను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాకు విశిష్ట చరిత్ర ఉందని మన పూర్వీకులు అందించిన గొప్ప వారసత్వ సంపద యోగా అని అన్నారు. ఏ క్రీడల్లో రాణించాలన్నా ప్రాథమి కంగా యోగా అభ్యసించడం తప్పనిసరి అని తత్ఫ లితంగా క్రీడాకారులు ఉన్నత స్థితికి ఎదుగుతారని అన్నారు. యోగా అభివృద్ధికి విన్యాస యోగా కేంద్రం కృషి చేయడం అభినందనీయని కొనియా డారు. తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీదంర్ సింగ్ మాట్లాడుతూ యోగా అభ్యసన ప్రతి ఇంట తప్పనిసరి అని అన్నారు. ఆరోగ్య సమాజ నిర్మాణంలో యోగాది ముఖ్య భూమిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో చల్ల హరిశంకర్, కన్న కృష్ణ, జయశ్రీ, నాగిరెడ్డి సిద్దారెడ్డి, ప్రశాంత్, ఆనంద కిషోర్, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి కుంటి రామకృష్ణ సాయి, సుధాంస్ రెడ్డి, కోచ్‌లు గంగా ధర్,మిడిదొడ్డి నవీన్, జిపి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సిసిఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్‌ని పునరుద్ధరించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిఎన్‌జిఓఎస్) పెద్దపల్లి జిల్లా (2026–29) తొలి కార్యవర్గ సమావేశం శనివారం రోజున ఐఎంఎ హాల్,ఐడీఓసి సమీపంలో జిల్లా అధ్యక్షులు బొంకూరి శంకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్య క్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ, సంచలనాత్మక నిర్ణయాలతో ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి చెల్లింపులు లేకుండానే కోటి రూపాయలు ఆ పైన ప్రమాద భీమా సౌకర్యం కల్పించడమే కాకుండా, ఉద్యోగులకు ఈ ఎచ్ ఎస్ స్కీం ని ప్రవేశ పెట్టి ఎన్నో ఉద్యోగ కుటుంబాలకు భరోసా ఇస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీ పి ఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం ద్వారా, మానసికంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సీ పి ఎస్ ఉద్యోగు



లకు మేలు చేకూర్చాలని, అలాగే ఆంక్షలులేని ఈ ఎచ్ ఎస్ విధానాన్ని రూపొందించి ఉద్యోగులకు సులువైన వైద్య సేవలు అందించాలని, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న పీఆర్సీ, డీఏ, పెండింగ్ బిల్లులను విడుదల చేస్తూ, మిగతా ఉద్యోగ సమస్యలను కూడా పరిష్కరించా లని తద్వారా ఉద్యోగ సంఘాల పక్షాన నిలిచి అక్కున చేర్చుకోవాలని టీఎన్జీఓ సంఘం పెద్దపల్లి పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అసోసి యేట్ ప్రెసిడెంట్ అనిత రెడ్డి , కోశాధికారి కొమురయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, స్వప్న కుమారి, సంయుక్త కార్యదర్శులు ప్రవీణ్, శ్రీధర్, రమేష్, సౌమ్య, యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు భాగ్యమ్మ, రాజిరెడ్డి, మంథని యూనిట్ అధ్యక్షుడు శంకర్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రజాపక్షం/మానకొండూర్: విద్యార్థి దశలోనే చట్టా లపై అవగాహన తప్పనిసరి కలిగించాలని ప్రత్యేక జ్యుడీ షియల్ ఫస్ట్‌క్లాస్ మ్యాజిస్ట్రేట్ (ఎక్సైజ్ కోర్టు) జడ్జి బానోత్ రాజేశ్వర్ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలమేరకు ఆయన ఆధ్వర్యంలో మానకొండూర్ మండలం దేవంపల్లి గ్రామంలోని తెలం గాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు బాల్య దశలోనే వివిధ రకాల చట్టాల గురించి అవగాహన ఏర్పరచుకోవాలని తెలి పారు. సమాజంలో ఒక బాధ్యత గల వ్యక్తిగా ఎదగా లంటే చట్టాలపైన అవగాహన తప్పనిసరి అని రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధుల గురించి విద్యా ర్థులు తెలుసుకోవాలని అన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని చరవాణికి ఏదైనా లింకు వస్తే తెలిసినవారు దాన్ని క్లిక్ చేయవద్దని కోరారు.




సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే లైసెన్స్ లేకుండా విద్యార్థి దశలో వాహనం నడిపితే తల్లిదం డ్రులు చట్టపరమైన సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుం దని విద్యార్థులు వాహనాలు నడుపవద్దని చెప్పారు. ఈ సందర్భంగా జడ్జి ఫోక్స్, మోటార్ వాహనాల చట్టం, రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలు న్యాయ సహాయం కోసం 15100 ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేష్, మానకొండూర్ సిఐ పి.శ్రీలత, కళా శాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానేరులో ఇసుక దోపిడీ

ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి మానేరు నది అక్రమ అర్జనకు అడ్డాగా మారింది. పేదల సొంతింటి కల అయిన 'ఇందిరమ్మ ఇళ్ల' పేరును అడ్డుపెట్టుకుని ఇసుక మాఫియా పగటి పూటే పగడ్బందీగా దోపిడీకి పాల్పడుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కాగితా లకే పరిమితం చేస్తూ, కొందరు ట్రాక్టర్ యజ మానులు సిండికేట్‌గా ఏర్పడి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో లక్షల రూపాయల ఇసుకను కాంట్రాక్టర్లకు విక్రయిస్తున్నారు.నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను గ్రామపంచాయతీ కార్యదర్శి,హౌసింగ్ ఏఈ ధృవీకరణ పత్రంతో మాత్రమే లబ్ధిదారులు తరలించుకోవాలి.కానీ, గ్రామంలో ఉన్న ఇళ్ల సంఖ్యకు,రోజువారీగా నది నుంచి ఖాళీ అవుతున్న ఇసుక పరిమాణానికి అస్సలు పొంతన ఉండటం లేదు.లబ్దిదారుల అవసరాన్ని మించి భారీ స్థాయిలో ఇసుకను నల్లబజారుకు తరలిస్తుండటంతో మానేరు నది సహజ వనరులు వేగంగా క్షీణించిపోతు న్నాయి.లబ్దిదారుల పేరు చెప్పుకుని కొందరు అక్రమా ర్కులు లక్షలు గడిస్తుంటే,అధికారులు కన్నులముందే



జరుగుతున్న ఈ దందాను ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అక్ర మంగా ఇసుకను తరలిస్తున్న కొన్ని ట్రాక్టర్లను కనీసం డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లు,అనుభవం లేని డ్రైవర్లు నడుపుతున్నట్లు తెలుస్తోంది.ఖమ్మంపల్లి మానేరు నుంచి రంగయ్యపల్లి, సీతంపేట, రామకృష్ణాపూర్, మైదుపల్లి మీదుగా ఆ డ్రైవర్లు గ్రామాల గుండా అతి వేగంతో ట్రాక్ర్లను దూసుకెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానిక ప్రజలు, పాఠశాల విద్యా ర్థులు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు.ఇప్పటి కైనా మైనింగ్, రెవెన్యూ,పోలీస్ అధికారులు స్పందించి ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## చిరు వ్యాపారులను, మిడ్ మానేరు బాధితులను ఆదుకోవాలి

ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడలోని అంబేద్కర్ నగర్ శాఖ సమావేశం, శాఖ కార్యదర్శి గాజుల పోశెట్టి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సమావేశానికి సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కదారి రాములు, పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కదారి రాములు మాట్లాడుతూ, మార్వాడీల రాకతో స్థానిక కులవృత్తులు, వ్యాపా రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెప్పులు అమ్మేవారు రోడ్లపైనా, గాజుల వ్యాపారులు గుడి మెట్లపైనా దుకా ణాలు సర్దుకుని అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరువ్యాపారులకు, వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చి ఆదుకుంటామని చెప్పినప్పటికీ, ఆ హామీలు ఆచరణకు నోచు కోకపోవడంతో పేద, ధనిక మధ్య అంతరం పెరుగుతోందని విమ ర్శించారు. కేంద్ర మోదీ ప్రభుత్వం చెబుతున్న సంక్షేమ పథకాలన్నీ కేవలం ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమవుతున్నాయని ఆరోపిం చారు. మిడ్ మానేరులో ఎక్కువ టీఎంసీల నీరు నింపడం వల్ల చుట్టుపక్కల రైతుల పొలాలు, పత్తి పంటలు దెబ్బతింటున్నాయని, ఆ నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గాజుల రమేష్, మల్లేశం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి ప్రశంసా పత్రం

ప్రజాపక్షం/చందుర్తి : మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతూ 2026 ఐపిఇ ఫలితాలలో 468/470 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో విశిష్ట స్థానం పొందిన విద్యార్థిని శ్రీరాం శ్రీహిత కు హైద రాబాద్ కి చెందిన యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డు సంస్థ వారు శనివారం ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరిం చారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ లక్ష్మీ కి కూడ ప్రశంసా పత్రం అందజేసి ఆమె సేవలకు అభినందించారు.విద్యా ర్థిని సాధించిన ఈ ఘనత పట్ల కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## గోదావరిఖని – జమ్మికుంట నూతన ఆర్‌టిసి బస్సు సర్వీస్ ప్రారంభం

ప్రజాపక్షం/ముత్తారం : గోదావరిఖని నుండి పారుపల్లి మీదుగా జమ్మికుంటకు వెళ్లే నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ శనివారం ఘనంగా ప్రారంభమైంది.స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన బస్సు సర్వీసుకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లా డుతూ.. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.కొత్త బస్సు సర్వీస్ అందుబాటులోకి రావడం వల్ల ఆయా గ్రామాల ప్రజల రవాణా ఇబ్బందులు పూర్తిగా తొలగిపో యాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు నేరుగా రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు,వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఈ సర్వీస్‌తో ఆ సమస్యలకు తెరపడిందని ఆయన అన్నారు.

**విద్యార్థులు, వ్యాపారులకు వరం :** ఈ నూతన బస్సు సౌకర్యంతో చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరుకోవడానికి, వ్యాపారులు తమ వ్యాపార పనుల నిమిత్తం సులు వుగా ప్రయాణించడానికి ఎంతో మేలు జరుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయ కులు,వివిధ గ్రామాల ప్రజలు,ప్రయాణికులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర రాజీనామా యువత నీట్ విద్యార్థుల విజయం

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : కేంద్ర మంత్రి రాజీనామా చేయడం యువత, నీట్ విద్యార్థుల విజయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఆదివారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ సైతం మద్దతు తెలిపి విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చక్రపాణి, రాఘవ రెడ్డి, కంబాల మల్లారెడ్డి ,గుండ్లపల్లి పూర్ణ చందర్ , మ్యాన రవి, అడిచెర్ల సాయి, బూర బాలు, గెంట్యాల శ్రీనివాస్, వేముల రాములు,లింగంపల్లి మధుకర్, పంగ రవి, కొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తం

ఎఎంసి చైర్మన్ కూన గోవర్ధన్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ రూపొందించిన కంటింజెన్సీ ప్లాన్‌లోని సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని మెట్‌పల్లి ఎఎంసి చైర్మన్ కూన గోవర్ధన్ పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ విడుదల చేసిన అవగాహన వీడియోలో పొందుపరిచిన సూచనలను రైతు సోదరులు తప్పకుండా అనుసరించాలని ఆయన కోరారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల నిర్వహణ చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విధంగా వ్యవసాయ పనులు చేపట్టి, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని రైతులకు కూన గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు.

## మొగిలిపేట రహదారికి తాత్కాలిక మరమ్మతులు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మెట్పల్లి, ఖానాపూర్ ప్రధాన రహదారి మధ్యలో ఉన్న మొగిలిపేట గ్రామంలో రహదారి గుంతలుగా ఏర్పడడంతో గ్రామ సర్పంచ్ గోల్కొండ కళా రమేష్ తాత్కాలిక మరమ్మత్తులు శనివారం చేపట్టారు. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వడి నర్సింగారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేయించారని, కొద్దిరోజుల్లోనే ఆర్ అండ్ బి శాఖ ద్వారా శాశ్వత రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సమస్య తెలిపిన వెంటనే స్పందించిన నర్సింగారావుకు సర్పంచ్ కళ రమేష్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఒ డాక్టర్ సుజాత

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని ఆమె మండల ప్రజలకు సూచించారు.ఆమె వెంట జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ హరీష్, హెల్త్ ఎడ్యుకేటర్ తులసి రమణ, సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే

ఖుతుబోద్దీన్ పాషా



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం దేశంలోని విద్యావేత్తలు, విద్యార్థి లోకం సాధించిన ఘన విజయమని మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఖుతుబోద్దీన్ పాషా అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. దేశంలో వరుసగా జరుగుతున్న పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని మండిపడ్డారు.విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ, వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన పోరాటాల ఫలితంగానే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.భవిష్యత్తులోనైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా,పూర్తి పారదర్శకతతో పోటీ పరీక్షలను నిర్వహించాలని ఖుతుబోద్దీన్ పాషా డిమాండ్ చేశారు.

# వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకే 'జలసిరి'

జెడ్‌పి సిఇఒ గౌతమ్ రెడ్డి



**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ 'జలసిరి' కార్యక్రమంపై శనివారం సమీక్షా సమావేశం జరిగింది.జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గౌతమ్ రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.విబిజి రామ్ జి ఉద్యోగులు,ఐకేపీ సిబ్బంది, వీఓఏలతో కలిసి మండలంలోని వివిధ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని గౌతమ్ రెడ్డి తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో వంద శాతం సురక్షిత తాగునీరు అందించడం,నీటి సంరక్షణను బలోపేతం చేయడమే దీని ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు.ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వడంతో పాటు,గ్రామాల్లో నీటి సంరక్షణ నిర్మాణాలను పటిష్టపరచడమే లక్ష్యమని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పనుల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. జలసిరి కింద చేపట్టిన ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.గ్రామాల్లో నీటి సంరక్షణ, తాగునీటి వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ ఈ. ప్రేమ్ సాగర్,ఎంపీవో శశి కుమార్ రెడ్డి, ఏపీవో అనిల్ కుమార్, ఏపీఎం రవి వర్మ,సీసీ తిరుపతి,టి ఏ లు రాజేశం,నాని, వివిఓ లు,తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల ఎస్ఐ చిరంజీవి సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ చైర్మన్‌కు దళిత కౌన్సిలర్లు, నాయకుల వినతి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** కోరుట్ల సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) చిరంజీవిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు దళిత కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎస్ఐ చిరంజీవిపై ఎలాంటి ఆధారాలు లేకుండా ఏకపక్షంగా సస్పెన్షన్ విధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిష్పాక్షికంగా విధులు నిర్వహిస్తున్న దళిత అధికారిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. చిరంజీవి సస్పెన్షన్ అంశంలో వెంటనే జోక్యం చేసుకుని,ఆయనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని,సస్పెన్షన్‌ను ఎత్తివేసే దిశగా ఉన్నతాధికారులతో మాట్లాడాలని చైర్మన్ బక్కి వెంకటయ్యను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పందిస్తూ, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లాకు చెందిన దళిత ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాలను తీర్చిన సర్పంచ్



**ప్రజాపక్షం/ముత్తారం:** రైతు సంక్షేమమే ధ్యేయంగా మచ్చుపేట గ్రామ సర్పంచ్ చిలువేరి జ్యోతిలక్ష్మణ్ తీసుకున్న తక్షణ చర్యలపై స్థానిక రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. మచ్చుపేట శ్రగ్రామంలోని తాళ్ల బాట నుండి తూలమూల పొలాలకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతింది. దీంతో పొలాలకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రైతుల కష్టాలను, రహదారి పరిస్థితిని గుర్తించిన సర్పంచ్ చిలువేరి జ్యోతిలక్ష్మణ్ వెంటనే స్పందించారు. వ్యవసాయ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా,స్వయంగా పర్యవేక్షించి రహదారిపై మొరం పోయించి అత్యవసర మరమ్మతులు చేయించారు. సమస్యను చెప్పిన వెంటనే పరిష్కరించి, చొరవ చూపిన సర్పంచ్ కి తూలమూల రైతులు హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. రైతు సంతోషమే గ్రామ అభివృద్ధికి అసలైన బలం, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించడమే నిజమైన ప్రజాపాలన అని ఈ సందర్భంగా రైతులు కొనియాడారు.ఈ రహదారి పరిశీలన, మరమ్మతు కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంత్తుల రాకేష్, వార్డు సభ్యులు దుండే జ్యోతి రాణిరాజేందర్, బంధారపు సాగర్, కోమల్ల సంధ్యతిరుపతి పాల్గొన్నారు. అలాగే సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలిపిన వారిలో స్థానిక రైతులు జట్టవేన రాజయ్య, బకతట్ల కుమార్, కంచు కుమార్, బకతట్ల దేవేందర్, జెట్టావేనా సంపత్, మేడవేన రవి,కలవేన తిరుపతి,యాదగిరి మల్లికార్జున్,జట్టవేన రవీందర్,సంపత్,దార్ల సది,యాదగిరి స్వామి, ముత్తె మహేష్,గోవిందుల సతీష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో రెక్సులర్ ఫౌండేషన్ సభ్యులలో అర్హులైన వారికి అన్నపూర్ణ యోజన పథకం కింద గోదావరిఖని రెక్సులర్ వెల్ఫేర్ ఫౌండేషన్ నాయకులు నేరెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పలు కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. భాస్కర చారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి అబ్బాపూర్ మాజీ సర్పంచ్ యశోద రాజమౌళి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు అందజేశారు .ఈ సందర్భంగా నిర్వాహకులు మా ట్లాడుతూ ఝార్ఖండ్ లో ప్రారంభమైన ఈ స్వచ్ఛంద సంస్థ ఎ లాంటి లాభాపేక్ష లేకుండా పేద ప్రజలకు సేవలందిస్తోందన్నా రు. విద్య , వైద్యం ,మౌలిక సదుపాయాలను ప్రతి పేదవానికి చేరవేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అన్నదానం మహాదానం నీవు తిను మరో ఇద్దరికి తినిపించు అనే సందేశంతో అన్నదాన నిత్యవసర సరుకులు పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వాల్గోండా త్రికూట ఆలయ చైర్మన్‌గా లక్ష్మీ రమేష్

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** వాల్గోండా గోదావరి తీరాన ప్రసిద్ధిగాంచిన శ్రీ రామలింగేశ్వర త్రికుటాలయ నూతన చైర్మన్గా చిలివేరి లక్ష్మి రమేష్, వైస్ చైర్మన్గా శీలం రవి లు శనివారం నియమితులయ్యారు. గోదావరి నది తీరాన వెలసిన శ్రీ రామలింగేశ్వర ఆలయంలో ప్రతి ఏటా శివరాత్రి శ్రావణమాసం ఉత్సవాల్లో వేలాది మంది భక్తుల పూజల అందుకుని ప్రాచీనాలయంగా అభివృద్ధి చెందిందని,భక్తుల ఆకాంక్షలకు కట్టుబడి ఉన్న శ్రీ రామలింగేశ్వర ఆలయ చైర్మన్గా తాను నియమితులైనందుకు ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ఎన్నో సహాయ సహకారాలు చేశామని భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేసేలా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.వీరితోపాటు కమిటీ సభ్యులుగా ఉంగరాల సంతోష్ రజిత,నరసయ్య,రఘు నేరెళ్ల లక్ష్మి నరసయ్య,తదితరులు ఉన్నారు. కాగా పలువురు మహిళలు చైర్మన్గా ఎన్నికైన లక్ష్మి ని శాలువాతో సన్మానించి అభినందించారు.

## కొండగట్టు అంజన్నను సందర్శించిన రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్

శ్రీ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థాన అధికారులు,ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, వేద పండితుల వేదాశీర్వచనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి,అధనపు కలెక్టర్ బి.ఎస్.లత స్థానిక ఎమ్మార్వో శ్రీనివాస్ ,హరిహరనాథ్ సునీల్ కుమార్ పర్యవేక్షకులు ఉప ప్రధాన అర్చకులు,చిరంజీవ స్వామి, స్థానాచార్యులు కపీంధర్, అధికారులు, తదితరులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** తొలి ముక్కోటి ఏకాదశి వేడుకలు పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఆలయాల్లో వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ మెరకు మండల కేంద్రంలోని శ్రీ కనక స్వామి శివాలయం,వాల్గోండా గోదావరి నది తీరాన ఉన్న శ్రీ రామలింగేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలోని ఆలయాల్లో వేకువ జాము నుండి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపించి మొక్కలను చెల్లించుకున్నారు. స్వామి వారం దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేసి తొలి ముక్కోటి ఏకాదశి ప్రాధాన్యతను భక్తులకు వివరించారు.ఈ కార్యక్రమాలలో భక్తులు పాల్గొన్నారు.

## వసతుల జాడేది..?

ఏకాదశి వేళ మహిళల ఇబ్బందులు

అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

**ప్రజాపక్షం / చెన్నూరు :** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులు, మహిళలు తీవ్ర అవస్థలు పడ్డారు. తెలంగాణలో అతిపెద్ద ఉత్తరవాహినిగా ప్రఖ్యాతిగాంచిన చెన్నూరుకు ప్రతి ఏటా మహాశివరాత్రి, తొలి ఏకాదశి వంటి పండుగలను పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు వచ్చి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ప్రతి ఏటా మున్సిపల్ అధికారులు మహిళలు దుస్తులు మార్చుకోవడానికి, భక్తులు సేద తీరడానికి టెంట్ల ఏర్పాటుతో పాటు పారిశుధ్య పనులు చేపట్టేవారు. అయితే ఈ ఏకాదశి సందర్భంగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి, కనీస వసతులు కూడా కల్పించలేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాలు ఆచరించిన మహిళలు బహిరంగ ప్రదేశాల్లోనే బట్టలు మార్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గోదావరి నదిలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో స్నానాలు చేసేందుకు భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కనీస ఏర్పాట్లు చేయకుండానే ప్రజాధనాన్ని వృథా చేసే అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరారు.

## నేరాల నిర్మూలనకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం / కోటపల్లి :** నేరాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కోటపల్లి మండలం ఎసన్వాయి గ్రామంలో జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు శనివారం ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటిని తనిఖీ చేసి, సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆపదలో డయల్ 100ను ఆశ్రయించాలని కోరారు. మరోవైపు గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 1000 లీటర్ల బెల్లపు పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ హరి తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు రూరల్ సిఐ ఆర్. కృష్ణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ రెడ్డి, సిఐలు సమ్మయ్య, అక్బర్ హుస్సేన్, స్థానిక ఎస్ఐలు, పాల్గొన్నారు.

## జైనూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా షేక్ రషీద్

**ప్రజాపక్షం / జైనూర్ :** జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా షేక్ రషీద్ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ నాయకత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల సమన్వయంలో ఆయనకున్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా షేక్ రషీద్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షురాలు సుగుణ, నియోజకవర్గ ఇన్చార్జి శ్యామ్ నాయక్, మాజీ ఎంఎల్ఏ ఆత్రం సక్కు, మాజీ డిసిసి విశ్వప్రసాద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో ఆషాఢ తొలి ఏకాదశి పూజలు

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఆషాఢ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో ఏక్నాహం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్ శర్మ, శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి గణపతి పూజ, ఫలపుష్పార్చన, నవగ్రహ పూజ, అభిషేకం, మంగళహారతి, మహామంత్రపుష్పం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ పట్టణానికి చెందిన చిలువేరు శంకర్ దాస్, విజయలక్ష్మి బృందం నిర్వహించిన భజనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం ప్రారంభమైన ఏక్నాహం కార్యక్రమం ఆదివారం ఉదయం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించాలి

ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** బెల్లంపల్లి పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లక్కీ డ్రా తీసి మూడు నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు తాళాలు అందజేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు జిల్లా కలెక్టర్ సమక్షంలో అట్టహాసంగా లక్కీ డ్రా నిర్వహించారని తెలిపారు. డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను అందజేస్తామని చెప్పి, ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. డ్రాలో పేర్లు వచ్చిన అర్హులు తమకు ఇళ్లు అందుతాయో లేదోనని తీవ్ర అయోమయానికి గురవుతున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అర్హులైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులను సమన్వయం చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోగరి రాహుల్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ కార్యకర్తకూ గుర్తింపునిస్తాం

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాపక్షం / లక్సెట్టిపేట :** పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్తనూ గుర్తిస్తామని, నేడు వెనుక ఉన్న వారిని రేపు ముందు వరుసలో కూర్చోబెడతానని మంచిర్యాల ఎంఎల్ఏ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్ఏఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. మంచిర్యాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. వైద్యం, విద్య రంగాల్లో నియోజకవర్గాన్ని ఇప్పటికే ఎంతో ముందుకు తీసుకెళ్లామన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున, రైతులు తొందరపడి వరి వేసి నష్టపోకుండా పెసర, మక్క, జొన్న వంటి ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. అంతకుముందు జిల్లా వ్యవసాయ అధికారులు నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ చతరజి రాజేష్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, కొక్కిరాల సురేఖ శాలువాతో సన్మానించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ దర్ని మధుకర్, ఆర్‌డిఎ మెంబర్ అంకతి శ్రీనివాస్, ఆర్‌జిపిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దం త్రిమూర్తి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ మోత్కూరు రాజేశ్వరి, వ్యవసాయ మార్కెట్ అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందులను అమ్మినా కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఎల్లపల్లి రైతు వేదికలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విక్రయించే ప్రతి ఎరువు, పురుగుమందుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. విత్తనాల నిల్వలను ఫామ్‌డి లో నమోదు చేయాలని, ఈపాస్ యంత్రం ద్వారానే ఎరువుల విక్రయాలు జరపాలని ఆదేశించారు. వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వరి విస్తీర్ణం తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నాసిరకం, నకిలీ పురుగుమందులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు వంశీ, శ్రీవిద్య, డీలర్లు రాజు, కృష్ణ, సంజీవ్, సుగుణాకర్, మహేష్, బండన్న, సాయి, గోపాల్, రవి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.



## ప్రమాదకరంగా మారిన స్టేడియం రహదారి

**ప్రజాపక్షం/మావల :** నిత్యం రద్దీగా ఉండే ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి వెళ్లే దారిలో మున్సిపాలిటీ ఖాళీ స్థలం ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇక్కడ మిషన్ భగీరథ పైపులు వేయడంతో మున్సిపల్ స్థలానికి సంబంధించిన కంచె విరిగి రహదారిపైకి వచ్చింది. ఈ మార్గం గుండా రోజూ వందలాది మంది క్రీడాకారులు, వాకింగ్ వచ్చే ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపైకి విరిగి పడిన కంచె వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ కంచె సరిగ్గా కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి విరిగిన కంచెను తొలగించి, తగిన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఈ-పాస్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు 202627 విద్యా సంవత్సరానికిగాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల విద్యార్థుల ఉపకారవేతనాల మంజూరు కోసం ఈపాస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి/కన్వీనర్ బి సునీత కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాల మంజూరు కోసం ఈపాస్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందించాలి

ఎంపిడిఒ అంజాద్ పాషా

**ప్రజాపక్షం / కెరమెరి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపిడిఒ అంజాద్ పాషా సూచించారు. శనివారం మండలంలోని ఝరి గ్రామంలోగల ఎంపియుపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన వంటకాలను పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు డ్రాప్‌అవుట్ కాకుండా నివారించాలని, ప్రతీరోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంరం మోతుభాయి నరేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు అడవులే ఆధారం

జిల్లా అటవీ అధికారి బాలామణి

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** మానవ మనుగడకు అడవులు ఎంతో కీలకమని జిల్లా అటవీ అధికారి (డిఎఫ్ఒ) బాలామణి పేర్కొన్నారు. సిర్పూర్ టి అటవీ రేంజ్ పరిధిలోని దుబ్బగూడ ప్లాంటేషన్‌ను శనివారం ఆమె సందర్శించి మొక్కల పెంపకం, సంరక్షణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోడు వ్యవసాయం పేరుతో ధ్వంసమైన అటవీ భూములను తిరిగి అటవీ శాఖ అధీనంలోకి తీసుకుని విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఎఫ్డిఓ అప్పయ్య, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, అటవీ శాఖ వాచర్లు పాల్గొన్నారు.

## బీటలు వారిన బంబారా సిసి రోడ్డు

ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండలం బంబారా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన సిసి రహదారి పగుళ్లు బారి అత్యంత ప్రమాదకరంగా మారింది. లక్షల రూపాయలతో నిర్మించిన ఈ రోడ్డు మధ్యలో మీటర్ల మేర భారీ చీలికలు ఏర్పడి, వర్షాలకు కుంగిపోతుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చీలికల్లోకి నీరు చేరి రోడ్డు అడుగుభాగం బలహీనపడుతోంది. నిత్యం రైతులు, విద్యార్థులు, అత్యవసర వాహనాలు వెళ్లే ఈ మార్గంలో రాత్రివేళల్లో చీలికలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

# ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజా వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దల ప్రభుదేవా

**ప్రజాపక్షం / మందమర్రి :** భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ప్రజా వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దల ప్రభుదేవా పిలుపునిచ్చారు. మందమర్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రజా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలు ఎదుర్కొన్న అనేక విపత్తులకు పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కారణమని, మొక్కల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నాదిపాట రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి సంజీవ్, మండల అధ్యక్షుడు సకినాల శంకర్, మద్దెల సంజీవ్, జావీద్ పాషా, పృథ్వి, దిలీప్ కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రత్యేక అధికారి తనిఖీలు

**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ మండలంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి, డిఆర్డిఓ కిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపిడిఓ సాయి వెంకట్ రెడ్డి, ఎంఇఓ పి. తిరుపతి రెడ్డిలతో కలిసి ముల్కల్ లోని టిజిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర గురుకుల పాఠశాల, పట్టణ అవాస పాఠశాల (యుఆర్ఎస్) బాయ్స్, మహాత్మ జ్యోతిబా పూలే బిసిడబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను శనివారం పరిశీలించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాలలు, భోజనశాలలు, మరుగుదొడ్లు, పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత అలవాటు చేసుకోవాలని, పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు.

# కెరమెరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుజాత్ ఖాన్

**ప్రజాపక్షం / కెరమెరి :** కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సుజాత్ ఖాన్ నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ నాయకత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల సమన్వయంలో ఆయన నకున్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుజాత్ ఖాన్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షురాలు సుగుణ, నియోజకవర్గ ఇన్చార్జి శ్యామ్ నాయక్, మాజీ ఎంఎల్ఏ ఆత్రం సక్కు, మాజీ డిసిసి విశ్వప్రసాద్, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఆయన నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# గోదావరి పైప్‌లైన్ వినియోగిస్తే క్రిమినల్ కేసులు

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ప్రజాపక్షం / జైపూర్ :** జైపూర్ మండలం శివ్వారం గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా కోసం గోదావరి నది నుండి ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ఎవరూ వినియోగించరాదని, ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య హెచ్చరించారు. పైప్‌లైన్‌ను గ్రామ సర్పంచ్ అక్రమంగా వేలం వేశారనే ఫిర్యాదులు అందిన నేపథ్యంలో శనివారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇఇ వెంకటేశ్వర్, డిప్యూటీ ఇఇ కిరణ్ లతో కలిసి ఆయన గ్రామాన్ని సందర్శించారు. గోదావరి ఒడ్డున ఉన్న పైప్‌లైన్‌ను పరిశీలించిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, మౌలిక సదుపాయాలను అనధికారికంగా వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా ఈ పైపులైన్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. దీనిపై గ్రామ ప్రజలు స్పందిస్తూ ఇకపై పైపులైన్‌ను ఎవరూ ఉపయోగించరాదని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి. సత్యనారాయణ, ఎంపిఓ శ్రీపతి బాపురావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఇ ఎన్. రాజమల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సృజన, సర్పంచ్ అంజన్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్ద చల్లా విశ్వంబర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్‌సిలకు మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవుల్లో తీవ్ర అన్యాయం

మాజీ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దుర్గం జీవన్



**ప్రజాపక్షం / వాంకిడి :** ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల ప్రకటించిన మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకాల్లో ఎస్‌సి సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ నియామకాలను వెంటనే పునఃసమీక్షించి సామాజిక న్యాయం చేయాలని కనర్గాం ఉపసర్పంచ్, మాజీ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దుర్గం జీవన్ డిమాండ్ చేశారు. వాంకిడి మండల కేంద్రంలోని జేత్వన్ బుద్ధ విహార్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నప్పటికీ, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఒక్క అధ్యక్ష పదవి కూడా ఎస్‌సిలకు కేటాయించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న నాయకులను విస్మరించడం సరికాదని విమర్శించారు. డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ కూడా జిల్లా స్థాయిలో సామాజిక సమతుల్యతను పాటించడంలో విఫలమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, టిపిసిసి నాయకత్వం వెంటనే స్పందించి మండల అధ్యక్షుల నియామకాలను పునఃసమీక్షించి ఎస్‌సిలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ఎస్‌సి సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు భవనానికి స్థలం కేటాయించాలి

మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్




**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్ తాలూకాతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలో మున్నూరు కాపు కులస్తులు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని తెలిపారు. సంఘ సమావేశాలు, సామాజిక, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత కమ్యూనిటీ హాల్ అవసరమని వివరించారు. అనుకూలమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి రెవెన్యూ ప్రక్రియ పూర్తి చేసి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహసీల్దార్ ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గజ్జల లావణ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి మహేష్, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, మహిళా అధ్యక్షురాలు బొలిశెట్టి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లి తిరుపతి, పెద్దింటి హనుమంతు, పులిశెట్టి వెంకటేష్, కిరణ్, పార్వతి సురేష్, సాయిదామ్ అశోక్ పాల్గొన్నారు.

# సామాజిక, విద్యా రంగాల్లో బిసిలు అభివృద్ధి చెందాలి

**ప్రజాపక్షం / మందమర్రి :** దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన బిసి వర్గాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు కొండిల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బిసి మండల్ డే సందర్భంగా ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబిసి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం మహాసభల వాల్ పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిసిల అభివృద్ధి కోసం 1980లో బిపి మండల్ కమిషన్ నివేదిక సమర్పిస్తూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు, భూసంస్కరణలు, విద్యా కోటా కల్పించాలని సిఫారసు చేసిందన్నారు. ఆ సిఫారసులు ఆగస్టు 7న అమలులోకి వచ్చాయని గుర్తుచేశారు. బెంగళూరులో జరిగే ఓబిసి జాతీయ మహాసభలకు బిసిలందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాయబారపు కిరణ్, మూడారపు శేఖర్, గాండ్ల సంజీవ్, మద్ది వేణుగోపాల్, జాడ క్రాంతి కుమార్, గరిగ సుమన్, కలీం పాల్గొన్నారు.



# మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రామగిరి బానేష్ నేడు ప్రమాణం

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రామగిరి బానేష్ ఆదివారం పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఈ సారి ఎస్సీ జనరల్ స్థానంకు కేటాయించడంతో గత 16 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకు పని చేస్తున్న బానేష్ గతంలో ఎస్సీ కోటాలో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డిసిసి మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖల ఆశీస్సులతో తనపై నమ్మకంతో మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తగా, నాయకునిగా ఎస్సీసెల్ అధ్యక్షునిగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా తాను ఎమ్మెల్యే సహకారంతో ప్రజాసేవలో ఉన్నానని ఇప్పుడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మంచిర్యాలలోని రైతుల పక్షాన నిలవడానికి కృషి చేస్తానని అన్నారు. మంచిర్యాల మార్కెట్ కమిటీ సభ్యుల సహకారంతో ఎమ్మెల్యే ఆశీస్సులతో రైతులకు మేలు చేసే విధంగా కృషి చేస్తానని బానేష్ ప్రజాపక్షంతో పేర్కొన్నారు.

# ఎంపి వ్యాఖ్యలను ఖండిస్తు బిఆర్ఎస్ నిరసన

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తు శనివారం మంచిర్యాల నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. మంచిర్యాల అంబేద్కర్ విగ్రహం వద్ద బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కార్పోరేషన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా మంచిర్యాల బిఆర్ఎస్ అధ్యక్షుడు గాదె సత్యం మాట్లాడుతూ, నిన్న కేటిఆర్ పుట్టినరోజు తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటే వ్యగంగా మాట్లాడిన ఎంపి వంశీకృష్ణ వెంటనే కేటిఆర్‌కు తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీరు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ఎన్ని అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే కేటిఆర్‌కు ఎంపి వంశీకృష్ణ క్షమాపణ చెప్పకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మంచిర్యాల బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రి సమస్యలు తీర్చాలి

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్

**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** కాగజ్ నగర్ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి కుషన్ రాజన్న డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై విస్తృత సర్వే నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగులు, వారి బంధువులు, సిబ్బంది, సూపరింటెండెంట్‌తో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో 20 మంది వైద్యులకు గాను నలుగురు మాత్రమే పనిచేస్తున్నారని, స్పెషలిస్ట్ వైద్యులు లేక ఆపరేషన్ థియేటర్ మూతపడిందని తెలిపారు. నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. మంచినీరు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆసుపత్రి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సర్వేలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ఆనంద్ కుమార్, రాజేందర్, పి. రాజేష్, మిట్టపెల్లి సుదర్శన్, గోమాస సుధాకర్ పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం / జైనూర్ :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్దిదారునికి చేరేలా గ్రామపంచాయతీ కృషి చేస్తోందని జైనూర్ మేజర్ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్ తెలిపారు. శనివారం జైనూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ డబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ అనేది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు జీవనోపాధికి ఎంతో ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఊరూరా విస్తృతస్థాయిలో జలసిరి కార్యక్రమం

### మంత్రి సీతక్క



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృతస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సూచించారు. అన్ని జిల్లాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డీఆర్‌డీఓలు, జడ్పీ సీఈఓలు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో ఎంపీడీఓలతో మంత్రి సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెర్ప్ సీఈ, దివ్యదేవరాజన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీబీజీ రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు విరివిగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. గ్రామసభలను నిర్వహిస్తూ ఈ పనుల అవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆగసు 15 నాటికి అన్ని గ్రామాల్లో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భజలాలను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం వీబీజీ రామ్‌జీ పథకం కింద ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరుబావుల రీచార్జి వంటి నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో విరివిగా జలసిరి కార్యక్రమం అమలయ్యేలా చూడాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటించాలని దిశానిర్దేశం చేశారు. గ్రామసభలలో చర్చించుకుని చేపట్టే ప్రతి పని ప్రజలక ఉపయోగకరంగా నిలవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

## భైంసా లో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

### భారీ శోభయాత్ర

ప్రజాపక్షం/భైంసా : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భైంసా పట్టణంలో వేడుకలు ఘనంగా జరిగాయి.పురాణ బజార్ లోని మార్వాడి భవన్ నుండి ప్రారంభమైన విఠలేశ్వరుని పల్లకి యాత్ర ప్రధాన వీధుల గుండా కొనసాగింది.ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ శోభయాత్రను ప్రారంభించి,శోభయాత్ర పూర్తయ్యే వరకు భజన దిండి లతో కలిసి యాత్రలో ఉన్నారు. చిన్నారులు విఠల్ రుక్మిణి భక్త తుకారం వేషధారణలో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మాట్లాడుతూ వార్కరి సాంప్రదాయం ప్రపంచంలోనే చాలా గొప్పదని, ఆధ్యాత్మిక మార్గంతో ఐక్యత భావం పెంపొందడం తో పాటు సన్మార్గం వైపు పయనించగలుగుతామన్నారు.శోభాయాత్రలో భక్తులకు ప్రతి ఇంట స్వాగతం పలికారు.మహిళలు సైతం పాల్గొన్నారు.

## ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/ఖానాపూర్ : భారత ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ డిమాండ్ చేశారు.శనివారం మండల బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు.అనంతరం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా పుప్పాల ఉపేందర్ మాట్లాడుతూ, దేశ ప్రధానమంత్రి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి అని, అలాంటి పదవిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధ్యతాయుత ప్రజాప్రతినిధికి తగదన్నారు.ఎమ్మెల్యే వెంటనే తన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని,లేనిపక్షంలో చట్టం ప్రకారం కఠిన



చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు కీర్తి మనోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రవీందర్ రెడ్డి,సీనియర్ నాయకులు పిట్టల భూమన్న, తోకల బుచ్చన్న,ఆదిదేలా మహేష్,బత్తుల నారాయణ,దాసరి శ్రీనివాస్,పాల్గొన్నారు.

## సర్కారు బడిలో చదివిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

ప్రజాపక్షం/దిలావర్ పూర్ :ప్రభుత్వ పాఠశాలల పై నమ్మకంతో తమ పిల్లలను మొదటి తరగతి నుండే సర్కారు బడిలో చదివిస్తున్నా సాంగ్వి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కే. మహేందర్ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఛాత గ్రామంలోని ఎంపీ యూపీఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కే. మహేందర్ కుమారుడు కే. రేయన్ శౌర్య, కుమార్తె కే. శ్రియాంశి ఇద్దరినీ 1వ తరగతి నుండే ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు.ఇప్పటికే కుమారుడు రేయన్ శౌర్య ఎంపీ యూపీఎస్ సాంగ్వి పాఠశాలలో 5వ తరగతి వరకు చదివాడు.ఈ విద్యా సంవత్సరం కుమార్తె శ్రియాంశిని ఎంపీపీఎస్ వెంగ్వాపేట్ నుండి ఎంపీ యూపీఎస్ సాంగ్వి పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించారు. ప్రైవేట్ పాఠశాలల హడావిడి మధ్య కూడా ప్రభుత్వ విద్యపై విశ్వాసంతో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతుండడం గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటోంది.అదేవిధంగా పాఠశాల విద్యా వాలంటీర్ కొరకు తమ వంతు ఆర్థిక సహాయాన్ని



అందించి ఉదారతను చాటుకున్నారు.ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే, విద్యార్థుల తల్లిదండ్రులకు సర్కారు బడులపై అవగాహన కల్పిస్తున్న మహేందర్ చర్య యువ తల్లిదండ్రులకు స్ఫూర్తిదాయకంగా మారింది.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ఉపాధ్యాయుల కృషితో పిల్లలు ఉన్నతంగా రాణిస్తారని మహేందర్ అన్నారు.ఆయన సేవలను గ్రామస్తులు,పాఠశాల యాజమాన్యం అభినందించారు.

## డిజిపి కార్యాలయం నుంచి గోదావరి పుష్కరాలు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : గోదావరి పుష్కరాలు–2027 సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై డీజీపీ కార్యాలయం నుంచి ఏడీజీపీ (లా అండ్ ఆర్డర్) శ్రీ మహేష్ మురళీధర్ భగవత్, ఐపీఎస్ రాష్ట్రంలోని పుష్కర జిల్లాల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ పాల్గొన్నారు.సమీక్ష సందర్భంగా పుష్కర ఘాట్‌ల వద్ద వాచ్ టవర్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థలు, డ్రోన్ సర్వైలెన్స్, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర స్పందన బృందాలు వంటి భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఏడీజీపీ ఆదేశించారు. అలాగే నిర్మల్ జిల్లాలోని బాసర, సోన్, సావర్గాం ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా సమగ్ర



కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, కృష్ణ, సత్యనారాయణ,దీపక్, రవీందర్,ఆర్ఐ రామ్‌నిరంజన్,సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ధర్నాల ఫలితమే విద్యార్థుల విజయం

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

ప్రజాపక్షం/మాముధోల్ : నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, ప్రశ్న పత్రం లీకేజ్ అంశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల విజయమని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్ అన్నారు. ముధోల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచే డిమాండ్ చేస్తోందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లోనై విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీ సాధించిన రాజకీయ విజయం కంటే, విద్యార్థుల న్యాయం కోసం సాగిన పోరాటానికి లభించిన విజయంగా భావించాలని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ



ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, బషీర్, ఇజాజ్ ఉద్దీన్,మండల అధ్యక్షులు కిష్టయ్య కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంపిడిఒ

### ఎంపిడిఓ అంజాద్ పాషా

ప్రజాపక్షం / కెరమెరి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలని కెరమెరి ఎంపిడిఓ అంజాద్ పాషా అన్నారు. శనివారం మండలంలోని ఝరి గ్రామంలోని ఎంపియుపిఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసిన ఆయన, విద్యార్థులు డ్రాప్‌అవుట్ కాకుండా నివారించాలని, ప్రతీరోజు బడికి వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంపిడిఓ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తక్కువ వర్షపాతం నమోదవుతున్న తరుణంలో భూగర్భ జలాల పెంపునకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ కుంరం మోతుబాయి ననేశ్వర్, ఏపిఒ మల్లయ్య, ఇసి నాగోరావ్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుర్నులే మెంగజీ

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండల కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా గుర్నులే మెంగజీని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. ఈ మేరకు పార్టీ అధికారికంగా నియామక ఉత్తర్వులు జారీ చేసింది. తొలి ఏకాదశి పర్వదినాన గుర్నులే మెంగజీకి మండల కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు దక్కడం శుభపరిణామమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం ఆయనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేలా కృషి చేయాలన్నారు. గుర్నులే మెంగజీ నియామకం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## మహిళా సంఘం నూతన కార్యవర్గం ఎనిక

ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో దేవి, గ్రామ సంఘంలో 20252026 సంవత్సరంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20252026 వార్షిక లెక్కలు చదివి విన్పించారు. అలాగే నూతన కార్యవర్గాన్ని సైతం ఎన్నికున్నారు. అధ్యక్షురాలిగా రవళి, ఉపాధ్యక్షురాలిగా నవ్యశ్రీ, కార్యదర్శిగా సౌమ్య, కోశాధికారిగా హారిక, లక్ష్మీ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపిఎం గంగాధర్, సిసిలు తడకల శ్రీనివాస్, సంతోష్, గాజుల శ్రీనివాస్, వివోఏ లు లావణ్య, వసుధ, వసంత, గ్రామ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## చేపూర్ పంచాయతీ సెక్రటరీకి మాతృవియోగం

ప్రజాపక్షం/ఆర్మూర్ : మండలంలోని చేపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ లోక హరీష్‌రెడ్డి ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లోక హరీష్‌రెడ్డి తల్లి శనివారం మధ్యాహ్నం కన్ను మూశారు. అదేరోజు సాయంత్రం అంత్యక్రియలు జరిపించారు.

## వైభవంగా సామూహిక వ్రతోత్సవం

ప్రజాపక్షం/సారంగాపూర్ : మండలంలోని బోరిగం గ్రామంలో ఏకాదశిని పురస్కరించుకుని శివాలయంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు తుపాకుల వెంకటరమణ చారి శనివారం సామూహిక సత్యనారాయణవ్రతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏకాదశి రోజున సత్యనారాయణ స్వామిని కొలవడం ద్వారా సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో,సుఖ సంతోషాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.వ్రతోత్సవం అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మహిళలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం బిజిలీపూర్ గ్రామంలో విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు విద్యుత్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సింగల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌తో గత ఆరునెలలుగా ఓవర్‌లోడ్‌తో ఫేస్‌వైర్ తరుచూ పోతుందని, దీంతో విద్యుత్ సమస్య తలెత్తుందని అన్నారు. ఈ విషయమై ఏఈ నరేందర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి కరెంట్‌ను పునరుద్ధరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## వనదుర్గమ్మ సన్నిధిలో జిల్లా విద్యాధికారి

ప్రజాపక్షం/పాపన్నపేట: మెదక్ జిల్లా విద్యా శాఖ అధికారి రాజు శనివారం ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆయన జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్ట మొదటిసారిగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. డిఇఓ రాజుకు వేద పండితులు ఏడుపాయల ఆలయ ప్రశస్తిని వివరించారు. ఆయన వెంట అక్షయ పాత్ర మెదక్ ప్లాంట్ మేనేజర్ త్రిపాఠి, పవన్ కుమార్, రాకేష్ కుమార్, భట్టు నాగరాజు, వికాస్ రాజు, బత్తిని రాజు తదితరులు పాల్గొన్నారు.



### మామడ,లక్ష్మణచందా మండలాల్లో

## బిఎల్ఎస్, బిఎల్ఎల సమన్వయ సమావేశం

ప్రజాపక్షం /మామడ : ఆగస్టు 3వ తేదీలోపు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు, అవసరమైన సవరణలు, ఆన్‌లైన్ ప్రక్రియ 100 శాతం పూర్తయ్యేలా ప్రతి బూత్ లెవల్ సూపర్‌వైజర్ (బిఎల్ఎస్), బూత్ లెవల్ ఏజెంట్ (బిఎల్ఏ) అప్రమత్తంగా వ్యవహరించి బాధ్యతాయుతంగా పనిచేయాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు గారు సూచించారు.నేడు మామడ మండలం, లక్ష్మణచందా మండలాల్లో నిర్వహించిన బూత్ లెవల్ సూపర్‌వైజర్లు (బిఎల్ఎస్), బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) సమన్వయ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బీఎల్ఎస్, బీఎల్ఏ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి అర్హులైన ఓటరు నమోదు కాకుండా మిగలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశాల్లో మామడ, లక్ష్మణచందా మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమరెడ్డి, జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి గాజుల రవి కుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొట్టె శేఖర్ ,మామడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాథోడ్ సంతోష్,లక్ష్మణ్ చందా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్రు నరేష్ రెడ్డి,మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్,పర్పెల్లి ప్రతాప్ రెడ్డి,కాలగిరి గంగారెడ్డి, లక్ష్మణ్ చందా మాజీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్,నల్ల లింగ రెడ్డి,మామడ మాజీ సర్పంచ్ బాపయ్య,మాజీ ఎంపీటీసీ సయ్యాద్ అన్వర్,తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్ మున్సిపల్ సమావేశంలో రసాభాస

### ఎమ్మెల్యే వైఖరిపై కౌన్సిలర్ల తీవ్ర ఆగ్రహం

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో రసాభాస జరిగింది. పట్టణ అభివృద్ధి పనుల విషయంలో అధికారుల పట్ల స్థానిక ఎమ్మెల్యే వ్యవహరిస్తున్న వైఖరిని పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు తీవ్రంగా వ్యతిరేకించారు.రివ్యూ మీటింగ్ పేరిట మున్సిపల్ అధికారులను బీజేపీ కార్యకర్తల ముందే అవమానించడం సరికాదని కౌన్సిలర్లు మండిపడ్డారు.అధికారులు ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు కావడంతోనే ఇలా అవమానించారా అని, అదే అగ్రవర్ణాల వారు ఉంటే ఎమ్మెల్యే ఈ విధంగానే వ్యవహరించేవారా అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలని, అధికారులను చులకన చేసేలా వ్యవహరించవద్దని ఈ సందర్భంగా సభ్యులు సూచించారు. ఎమ్మెల్యే నేరుగా కౌన్సిల్ సమావేశానికి హాజరై తన సలహాలు, సూచనలు ఇవ్వాలని,అంతేకానీ అభివృద్ధికి కేటాయించిన నిధులను అడ్డుకోవడం తగదని స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కౌన్సిల్ ముందుకు సాగుతుందని తెలిపారు. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశం ముగిసిన అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కౌన్సిలర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. సోనా ఫ్యాషన్స్ డిజైనర్స్ బోటిక్‌ను ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి : నిర్మల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సోనా ఫ్యాషన్స్ డిజైనర్స్ బోటిక్ షాప్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బోటిక్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యమైన వస్త్రాలు, వినూత్న డిజైన్లు మరియు ఉత్తమమైన సేవలను వినియోగదారులకు అందిస్తూ వారి నమ్మకాన్ని గెలుచుకోవాలని, వ్యాపారంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్లు కత్తి నరేందర్, గోప గోపిలతో పాటు పలువురు ముఖ్య నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.



## లోకేశ్వరంలో ఏకలవ్యుని జయంతి వేడుకలు

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలం లోని ఏకలవ్యుని జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎరుకల కుల మండల అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ ఏకలవ్యుడు గురుభక్తితో సాధన చేసి,విల్లు ని నేర్చుకున్నాడని ఆయన గురుభక్తితో ఎన్నో నేర్చుకున్నారని ఆయన చేసిన మరిన్ని సేవలను గుర్తుచేసుకొని పూలమాలలు నివాళులు అర్పించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నవీన్,నరేష్,పోశెట్టి ఆడేల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని మండల కేంద్రంలోని శివాలయం తో పాటు బ్రహ్మేశ్వర ఆలయంలో అలాగే బాగా పూర్ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు.ఏకాదశి సందర్భంగా మహావిష్ణువు నాలుగు నెలలు యోగ నిద్రలోకి వెళ్తారని ఆలయ అర్చకులు నరసింహా తెలిపారు.భక్తులు తమ తమ మొక్కులు చెల్లించుకుని వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడిపంటలు బాగా ఉండాలని వ్యాపారాలు అభివృద్ధి చెందాలని మొక్కులు మొక్కారు.

## ఇది విద్యార్థుల విజయభేరి

ప్రజాపక్షం/భైంసా : దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేసిన నిరంతర ఉద్యమం ఊరికే పోలేదని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే ఇందుకు నిదర్శనమని ఎన్ఎస్‌యుఐ నిర్మల్ జిల్లా మాజీ కార్యనిర్వాహక అధ్యక్షులు అంజద్ షేక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కేంద్ర మంత్రి రాజీనామాను విద్యార్థుల సాధించిన చారిత్రక విజయంగా ఆయన అభివర్ణించారు.అయితే, మంత్రి రాజీనామా అనేది కేవలం పాక్షిక విజయం మాత్రమేనని ఆయన గుర్తుచేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) వైఫల్యాల వల్ల ఎన్నో పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని,దీనివల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలోని విద్యావ్యవస్థలో తక్షణమే సమూల మార్పులు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థుల ఈ ఉద్యమం కేవలం కేంద్ర మంత్రి రాజీనామాతోనే ఆగిపోదని, దేశ విద్యావ్యవస్థలో గుణాత్మకమైన మార్పులు వచ్చేంత వరకు విద్యార్థుల పక్షాన ఈ పోరాటం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుందని అంజద్ షేక్ స్పష్టం చేశారు.

## ఏకలవ్య జయంతి వేడుకలు

ప్రజా పక్షం/భైంసా : ఆదివాసి ఆత్మగౌరవానికి, గురుభక్తికి, పట్టుదలకు ప్రతీక అయిన వీర ఏకలవ్య జయంతి వేడుకలను ఎరుకల సంఘం ఆధ్వర్యంలో భైంసా పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భైంసా పట్టణ మున్సిపల్ చైర్మన్ తుమ్మోల దత్తాత్రి వివిధ వార్డుల కౌన్సిలర్లు చెర్ల సుభాష్,తాలోడ్ శ్రీనివాస్, పుర ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొని, ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగ జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు మాట్లాడుతూ, ఏకలవ్యుడు గురువు లేకుండానే తన కృషితో విలువిద్యలో సాధించిన తీరు నేటి యువతకు ఆదర్శమని తెలిపారు.కుల,మతాలకు అతీతంగా విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు,పెద్దలు,యువకులు,పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మోదీపై అనుచిత వ్యాఖ్యలు

## ఎమ్మెల్యే వెడ్మ చర్యలకు బిజెపి ఆందోళన

ప్రజాపక్షం/మామడ : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీపై రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఖానాపూర్ ఎమ్మెల్యే వేడుమ బొజ్జుపటేల్ గారు అనుచిత వాక్యాలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం మామడ మండల బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆదేశాల మేరకు మామడ పోలీస్ స్టేషన్ లో బిజెపి నాయకులు ఫిర్యాదు దరఖాస్తు అందజేసి,ఎమ్మెల్యే పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రధానమంత్రి దేశానికి ప్రతినిధి. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఇలా మాట్లాడటం తగదు. వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మామడ మండల అధ్యక్షులు బత్తుల రంజిత్ కుమార్,న్యాయవాది కొండ్ర రాజారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు,సర్పంచులు సురేష్,అశ్విన్,మల్లయ్య,ఉప సర్పంచ్ గోవర్ధన ప్రవీణ్,జనరల్ సెక్రెటరీ ఎల్.వి. రమణ,మండల ఉపాధ్యక్షులు కరోల లక్ష్మి బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేశాం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది తానేనని, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రూ.1,650 కోట్లు వెచ్చించి నగర రూపురేఖలు మార్చామని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీలో వెలమ సంక్షేమ మండలి నూతన పాలకవర్గ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మొదటగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి, సంఘం బలోపేతం కోసం, సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వెలమ సంఘం బాధ్యులు ఎమ్మెల్యే గంగులకు శాలువా కప్పి, గజమాలతో ఘనంగా సన్మానించారు. నగర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఆయన్ను ఐదవ సారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని సంఘం స్పష్టం చేసింది. అనంతరం సంఘ భవన నిర్మాణం కోసం స్థలంతో పాటు నిధులను కేటాయించాలని వారు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన గంగుల.. తక్షణమే స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే గంగుల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టీఆర్ఎస్ పాలనలో ప్రతిరోజూ మంచినీటిని అందించడంతో పాటు, 24 గంటల మంచినీటి సరఫరా అందించేందుకు కృషి చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అద్భుతమైన అభివృద్ధి పనులను నిలిపివేసిందని ఆరోపించారు. సుమారు 5,000 మందికి ఉపాధి లభించడంతో పాటు సౌత్ ఇండియాలోనే పర్యాటక కేంద్రంగా వెలుగొందాల్సిన మానేరు రివర్ ఫ్రంట్‌ను, కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మనగర్‌లో టీటీడీ సహకారంతో రూ.25 కోట్లతో తలపెట్టిన వెంకటేశ్వర స్వామి ఆలయ భూ కేటాయింపులు, ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఇస్కాన్ టెంపుల్ నిర్మాణాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు.